క్లుప్తంగా

మంచినీటిని వృథా చేయరాదు



ప్యాలకుర్తిలో మంచినీటి బోరును పరిశీలిస్తున్న ఏఈ ప్రసాద్

కోడుమూరు రూరల్: మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ సూచించారు. గురువారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో ఏఈ ప్రసాద్ పంచాయతీ, ఇంజినీరింగ్ సిబ్బందితో కలిసి పర్యటించి మంచినీటి పథకాలను పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ.. వానలు పడుతున్న దృష్ట్యా నీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతనే కొళాయిలకు సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పైపులైన్లకు లీకేజీలుంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు.

తప్పుల్లేని ఓటరు జాబితానే లక్ష్యం



బీఎల్ఓతో మాట్లాడుతున్న తహసీల్దార్

పాణ్యం: తప్పుల్లేని ఓటరు జాబితాను తయారు చేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు చేసేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రతి ఒక్క బీఎల్ఓ తప్పకుండా ఒక రిజిస్టర్‌ను నిర్వహించుకోవాలన్నారు. అలాగే ఏమైనా తప్పులుంటే సరి చేసుకోవాలని సూచించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. థర్డ్ జెండర్ వారికి ఓటు నమోదుకు దరఖాస్తు స్వీకరించాలన్నారు. జెండర్ రేషియో, పాపులేషన్ రేషియోను పరిశీలించుకోవాలని తెలిపారు. మండలంలో కొత్తగా గగ్గటూరు గ్రామానికి పోలింగ్ బూత్ ఏర్పాటైనట్లు చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు వారి బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఆర్ఐ రామ్, వీఆర్ఓలు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

నేడు మెగా యోగా శిక్షణ

కల్లూరు: కల్లూరులోని రవీంద్ర విద్యాసంస్థల ప్రాంగణంలో శుక్రవారం ఉదయం మెగా యోగా మాస్ శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ బీఎస్ఎస్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కారును ఢీకొన్న టిప్పర్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని జాతీయ రహదారిపై గురువారం కారును టిప్పర్ ఢీకొంది. ఫ్లై ఓవర్ నుంచి దిగే క్రమంలో టిప్పర్ కారును ఢీకొనడంతో కారు దెబ్బతింది. కారులో ఉన్న ఎవరికీ గాయాలు కాలేదు. హైదరబాద్ నుంచి తిరుపతి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. టిప్పర్ వేగంగా రావడంతోనే ఈ ఘటన జరిగినట్లు పోలీసులు ప్రాథమిక అంచనా వేశారు.

నిరుపయోగంగా చేతిపంపు



పాత బావపురం ఎల్లమ్మ గుడి వద్ద నిరుపయోగంగా చేతిపంపు

కర్నూలు(రూరల్): నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతిపంపులు మరమ్మతులకు గురికాగా వాటిని అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కర్నూలు మండల పరిధిలోని పాత బావపురం గ్రామ సమీపాన ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన చేతిపంపు నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు ఇక్కడకు వచ్చిన భక్తులకు దాహం తీర్చేందుకు ఈ చేతిపంపే ఆధారం. పూజా కార్యక్రమాలకు నీటి కోసం ఈ బోరు ఉపయోగపడేది. ఈ చేతిపంపు మరమ్మతులకు గురై నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. చుట్టుపక్కల వారి నీటి అవసరాలను తీర్చే చేతిపంపును వెంటనే బాగుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఖరీఫ్ సాగు కష్టమే..!

- అందుబాటులో లేని రాయితీ విత్తనాలు
- ఇంకా అందని జీలుగలు
- ఈ ఏడాది ముందుగానే వర్షాలు
- రైతు సేవా కేంద్రాల నిర్వీర్యం
- ప్రభుత్వ తీరుతో అన్నదాతల ఆవేదన



భూపనపాడులో సాగుకు సిద్ధం చేసిన పొలం



అలమూరులో విత్తనాలు నాటుతున్న కూలీలు

పాణ్యం: ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే పలకరిస్తున్న తరుణంలో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతుంటే మరోపక్క ప్రభుత్వం మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తోంది. ముందస్తు వర్షాలు ఉంటాయని తెలిసినా అందుకు తగ్గట్టు రైతులకు కావాల్సి విత్తనాలు, మందులను అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వచ్చే నెల నుంచి ఖరీఫ్ సాగు ప్రారంభమవుతుంది. ఇంకా రైతులకు ఎలాంటి రాయితీ పథకాలు, ఎరువులు, విత్తనాలు అందలేదు. ప్రభుత్వ తీరుపై రైతులు మండిపడుతున్నారు. నాయకులు ప్రచారం కోసం ప్రకటనలు చేస్తున్నారే తప్ప రైతుల అవసరాలు తీర్చడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాణ్యం నియోజకవర్గంలో ఖరీఫ్‌కు సంబంధించి 90,830 ఎకరాల్లో పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వంలో ఆర్‌బీకేల ద్వారా రైతులకు విత్తనాల నుంచి విక్రయం వరకు అన్ని స్వగ్రామంలోనే జరిగేవని.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని వాపోతున్నారు.

రైతులకు అందని జీలుగలు

ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులు ముందుగా జీలుగలు, పిల్లిపెసరను సాగు చేసి తర్వాత పచ్చిరొట్టను పొలంలోనే కలియదున్నుతారు. దీంతో భూమిలో నత్రజని శాతం పెరుగుతంది. అలాంటి విత్తనాలు కూడా ఇంత వరకు ప్రభుత్వం అందించకపోవడం విడ్డూరం. రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేశారే తప్ప విత్తనాలు అందించలేదు. రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామన్న అన్నదాన సుఖీభవ పథకం ఇంత వరకు అమలు కాలేదు. ఏడాది నుంచి రైతులకు ఎలాంటి రాయితీ పథకాలు అందించలేదు. విత్తనాలు ఎరువులు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు దక్కే పరిస్థితి లేదు.

సాగుకు సన్నద్ధం

ఈ ఏడాది వర్షాలు ముందుగానే కురుస్తాయని వాతవారణ శాఖ అప్రమత్తం చేసింది. దీంతో రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రైతులు ఏ పంటలు వేయాలనే ఆలోచనలో తలమునకలయ్యారు. రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పించడం లేదు. ఇంకా విత్తనాలు అందక రైతులు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వంలో రైతుకు అండ

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ (2019–2024) రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపింది. ఆయా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు పూర్తి భరోసా కల్పించింది. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలు, రాయితీ విత్తనాలు, ఫర్టిలైజర్ మందులు, నీలిమందులు, ల్యాబ్, ఇతర అవసరాలు ఆర్‌బీకేల ద్వారానే అందేవి. మే వచ్చిందంటే ఖరీఫ్‌కు సంబంధించి జీలుగలు, పిల్లిపెసర విత్తనాలను సకాలంలో అందేవి. విత్తనం మొదలుకొని పంట విక్రయం వరకు రైతులకు అండగా నిలిచింది. కానీ కూటమి ప్రభుత్వం ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు తప్ప చేసిందేమీ లేదని రైతులు పెదవి విరుస్తున్నారు.

పాణ్యం నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు వివరాలు

మండలం	రైతులు	సాగువిస్తీర్ణం (ఎకరాల్లో)
పాణ్యం	7374	24230
గడివేముల	7168	18000
ఓర్వకల్లు	11005	23600
కల్లూరు	12750	25000

ఎలాంటి పథకాలు రాలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎలాంటి పథకాలు అందలేదు. అకాల వర్షాలకు పంటలు నీటిపాలైతే కనీసం పంటను కూడా చూడలేని దుస్థితి ఉంది. అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం. అష్టకష్టాలు పడి పంటను కాపాడుకున్నా మద్దతు ధర లేదు. వర్షాలు ముందుగానే పడుతాయని తెలిసినా రైతులకు విత్తనాలు అందించలేదు.

–శివుడు, గడివేముల

రైతు వ్యతిరేక ప్రభుత్వం



ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు రూ.20 వేలు ఇస్తామి కూటమి నాయకులు హామలు గుప్పించారు. తీరు అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా చిల్లిగవ్వ ఇవ్వలేదు. అసలు రైతులను పట్టించుకున్న పాపాన పోలేదు. అదిగో ఇదిగో అంటూ ప్రకటనలకే పరిమితం అవుతున్నారు. రాయితీ విత్తనాలు, ఎరువులు కూడా సక్రమంగా అందించడం లేదు. ఖరీఫ్ సాగు సైతం కష్టంగానే అనిపిస్తోంది.

–రామలక్ష్మయ్య, పాణ్యం

హమ్మయ్యా.. కాస్త నయం

సాక్షి ఎఫెక్ట్



యోగా చేసేందుకు నేలపై టార్పాలిన్ పట్టలు పరిచిన దృశ్యం

సి.బెళగల్: గత రెండు రోజులుగా యోగా శిక్షణ కేంద్రంలో నామ మాత్రపు ఏర్పాట్లు చేసిన మండల పరిషత్ కార్యాలయ అధికారులు, మూడవ రోజు టార్పాలిన్ పట్టలు పరిచి కాస్త నయం అనిపించారు. సి.బెళగల్‌లోని భార్గవ రాయల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో మండల స్థాయి యోగా శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ రాణెమ్మ ఆధ్వర్యంలో మండల పరిషత్ అధికారులు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు మంగళవారం బురదలో, రెండవ రోజు మట్టిలో యోగా కార్యక్రమాలను నిర్వహించిన తీరుపై 'సాక్షి' దినపత్రికలో కథనాలు వెలువడ్డాయి. స్పందించిన మండల పరిషత్ కార్యాలయ అధికారులు గురువారం మూడు చిన్న టార్పాలిన్ పట్టలు, మరో మూడు మ్యాట్‌లను శిక్షణా కేంద్రంలో నేలపై పరిచారు. అయినప్పటికీ యోగా శిక్షణ పొందేవారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో అవి సరిపడక కొంతమంది ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

యోగా శిక్షణపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రంగనాథ్‌బాబు

సి.బెళగల్: మండల అధికారులు, ఉద్యోగులు యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహణపై శ్రద్ధ వహించాలని మండల ప్రత్యేకాధికారి, కర్నూలు జిల్లా మత్స్యశాఖ డీడీ డాక్టర్ రంగనాథ్‌బాబు సూచించారు. ఆయన గురువారం భార్గవ రాయల్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో జరుగుతున్న మండల స్థాయి యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ.. యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహణపై మండల అధికారులు, ఉద్యోగులు శ్రద్ధ వహించాలన్నారు. మండల స్థాయిలో శిక్షణ పొందిన ఉద్యోగులు ఒక్కొక్కరు గ్రామాల్లో 50 మంది ప్రజలకు శిక్షణ ఇవాల్సి ఉంటుందన్నారు. శిక్షణ నిర్వాహకులు, శిక్షణకు వచ్చే ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. శుక్రవారం జరిగే యోగా శిక్షణ శిబిరంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మను ఆదేశించారు. అనంతరం యోగా అంశాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించి, యోగాసనాల పద్ధతులను, ఉపయోగాలను, యోగా విధానాలను వివరించారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి తదితరులు ఉన్నారు.

నిర్వహణకు నోచుకోని వాటర్ ట్యాంకు



వాటర్ ట్యాంకు చుట్టూ పేరుకుపోయిన చెత్త

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని జి.సింగవరం గ్రామంలో ప్రజలకు మంచినీరు అందించేందుకు ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకును గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. జీ.సింగవరం గ్రామంలో బస్టాండు సమీపాన ఉన్న నీటి ట్యాంకు చుట్టూ కంప చెట్లు పెరగడంతో విష పురుగులు సంచరిస్తున్నాయి. గతంలో ఈ ట్యాంకులోని మంచినీటిని అందరూ తాగేవారు. ట్యాంకు పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండి దుర్వాసన రావడం, చెత్తచెదారం పేరుకుపోవడంతో ఈ నీటిని తాగడం మానేశారు. ట్యాంకు చుట్టూ కంప చెట్లు ఉండటం వల్ల రాత్రి సమయాల్లో విష పురుగులు సంచరిస్తున్నాయని కాలనీవాసులు వాపోయారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టి ట్యాంకు చుట్టూ శుభ్రం చేయాలని కోరుతున్నారు.



ఒకవైపు వాలిన విద్యుత్ స్తంభాలు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

కర్నూలు(రూరల్): కర్నూలు మండల పరిధిలోని నిడ్జూరు గ్రామం నుంచి జి.సింగవరం వెళ్లే రహదారి పక్కన విద్యుత్ స్తంభాలు పొలంవైపు వాలిపోయి ఎప్పుడు పడిపోతాయో అన్నట్లుగా ఉన్నాయి. రోడ్డు పక్కన స్తంభాలు ఉండటంతో ప్రస్తుతం వీస్తున్న ఈదురు గాలులుకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు నిడ్జూరు నుంచి సుంకేసుల గ్రామం వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను సరిచేయాలని ఆ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గృహ నిర్మాణాలను పూర్తి చేయండి



బురాన్‌దొడ్డిలో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రంగనాథ్‌బాబు

సి.బెళగల్: మండలంలోని గ్రామాలలో గృహ నిర్మాణ లబ్ధిదారులు తమ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ డాక్టర్ రంగనాథబాబు సూచించారు. ఆయన గురువారం మండల అధికారులు, హౌసింగ్ సిబ్బందితో కలిసి మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలో పర్యటించారు. హౌసింగ్ కాలనీలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే గృహ అనుమతులు రద్దు చేయడం జరుగుతందని లబ్ధిదారులకు తెలియజేశారు. కాగా మండలంలో 189 మంది గృహ లబ్ధిదారులు ఉండగా 136 ఇళ్లు నిర్మాణం పూర్తయ్యాయి. 53 ఇళ్ల నిర్మాణ దశలో ఉండగా 20 మంది గృహ లబ్ధిదారులకు అదనపు నగదులో భాగంగా బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరైనట్లు మండల హౌసింగ్ అధికారులు ఆయనకు తెలిపారు. ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్‌రెడ్డి, లబ్ధిదారులు ఉన్నారు.

వేళకు వస్తే ఒట్టు!



ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది రాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

గడివేముల: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఏర్పాటు చేసిన సచివాలయాల్లో సేవలు నిర్వీర్యం అవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బిలకలగూడూరు సచివాలయంలో గురువారం వివిధ పనుల నిమిత్తం ప్రజలకు ఉదయం 11 గంటల సమయంలో కేవలం పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ మాత్రమే కనిపించారు. మిగతా కుర్చీలు ఖాళీగా దర్శమిచ్చాయి. కొత్త రేషన్‌కార్డుకు, కార్డులో మెంబర్స్‌ను చేర్చుకునేందుకు, రైతులు 1బీ, అడంగల్ వంటి తదితర పనులు చేయించుకునేందుకు వేచి ఉన్న వారు సిబ్బంది రాకపోవడంతో ఇంటికెళ్లారు. ప్రతి రోజు ఇదే పరిస్థితి ఉంటుందని వారు వాపోయారు. ఇక్కడి సిబ్బంది కొందరు ఎలాంటి సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొట్టడం, మధ్యాహ్న వేళకు గాని రోజలు వారీ విధులకు హాజరుకావడం లేదని ప్రజలు చెబుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



కాటసాని రాంభూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న ఓర్వకల్లు వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. ఇటీవల రెడ్డి మండల కమిటీ సభ్యులను నియమించారు. గరువారం పదవులు పొందిన వారు కాటసాని రాంభూపాల్ రెడ్డిని కల్లూరులోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలకు మోసం చేస్తున్న వైనాన్ని తెలియజేయాలని సూచించారు. కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగుదామన్నారు. నూతనంగా ఎన్నికైనా పార్టీ ఓర్వకల్లు మండల కమిటీ సెక్రటరీ ఎ.మధన్ మోహన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ పొట్టి శరత్ కాటసానిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుడు కొండ వెంగన్న, రాష్ట్ర గ్రీవెన్స్‌సెల్ సెక్రటరీ తిప్పాయపల్లె హరినాథ్ రెడ్డి, నాయకులు నాగతిరుపాలు, బీరం పుల్లారెడ్డి, మధు, మద్దిలేటి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీకి ఏర్పాట్లు చేసుకోండి



ఇనగండ్ల రేషన్ షాప్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం

సి.బెళగల్: జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాప్‌లలో కార్డుదారులకు సరుకులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం రేషన్ డీలర్లను ఆదేశించారు. ఆయన గురువారం మండల పరిధిలోని ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాల్లోని రేషన్ షాప్‌లను తనిఖీ చేశారు. ఇనగండ్ల గ్రామానికి చేరుకుని షాప్ నంబర్ 33, 36లలో రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా గుండ్రేవుల గ్రామంలోని 29, 41 రేషన్ షాప్‌లలో తనిఖీలు నిర్వహించి, వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా డీలర్‌తో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ.. జూన్ 1వ తేదీ నుంచి రేషన్ సరుకులను డీలర్ షాప్‌ల వద్ద పంపిణీ చేయాల్సి ఉంటుందని, అందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలన్నారు. డీలర్లు ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తప్పకుండా రేషన్ దుకాణాల్లోనే ఉండి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయాలన్నారు. 65 సంవత్సరాలు నిండిన లబ్ధిదారులకు వారి ఇళ్ల వద్దనే 5వ తేదీలోగా రేషన్ సరుకులను అందజేయాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ డీలర్లకు సూచించారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు సత్యరాజు, డీలర్లు ఉన్నారు.

గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలి



గర్భిణులు, బాలింతలకు సూచనలు ఇస్తున్న నోడల్ ఆఫీసర్

కల్లూరు: గర్భిణులు, బాలింతలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా నోడల్ అధికారి రఘు అన్నారు. మండల పరిధిలోని పెద్దటేకూరు సచివాలయంలో తల్లులు, గర్భిణులకు తట్టు, రూబెల్లా సంచార చికిత్స కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు వ్యాధినిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. గర్భంలో ఉన్న మహిళకు రూబెల్లా సోకితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందన్నారు. బిడ్డకు కంటి, వినికిడి లోపం, మెదడు, గుండె సంబంధిత లోపాలు కలుగుతాయన్నారు. తట్టు ఒక ప్రాణాంతక వ్యాధి కారణంగా చిన్నారుల్లో న్యూమోనియా, విరేచనాలు, మెదడువాపు వ్యాధులకు గురవుతారన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఓర్వకల్లు: నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉయ్యాలవాడలో సంచార చికిత్స కార్యక్రమాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్త్రీలలో రుతుచక్ర సమయంలో నీరసం, అలసట ఉంటుందన్నారు. వైద్య సిబ్బంది సలహాలు, సూచనలు పాటిండంతో పాటు విశ్రాంతి, ఆకుకూరలు, పాలు, పాల పదార్థాలు, తృణ ధాన్యాలు, పండ్లు తీసుకోవాలన్నారు.

అధిక ధరకు అమ్మితే చర్యలు



విత్తన దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: వ్యవసాయ శాఖ నిర్ణయించిన రేట్లకు కాకుండా అధిక ధరకు ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని విత్తన, మందుల దుకాణాల్లో ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, మందులకు సంబంధించిన స్టాక్ రికార్డులను ఏఓ పరిశీలించి దుకాణదారులకు పలు సూచనలిచ్చారు. ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించరాదన్నారు. విత్తనాలు విక్రయించే సమయంలో దుకాణదారులు తప్పనిసరిగా రైతులకు రసీదులివ్వాలని, రైతులు అడిగిన విత్తనాలను మాత్రమే ఇవ్వాలని, ప్రతిరోజు సరుకు ఎంత ఉందో స్టాక్ బోర్డులో కనబర్చాలని దుకాణదారులను ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ఎవరైనా లూజు విత్తనాలను అమ్ముతుంటే అలాంటి వారి సమాచారామిస్తే తగు చర్యలు తీసుకుంటామని ఏఓ రైతులకు సూచించారు.